
# అసలు సంగతి

- టి.పి.హేమమాలిని



**"వెళ్ళగానే క్షేమంగా చేరినట్లు ఫోన్ చెయ్యి దీపూ" బెంగగా చెప్పింది సువర్ణ. ఆరోజే కాలిఫోర్నియా నుండి ఇండియాకు బయల్దేరుతున్నాడు సుదీప్.**

"ఓహో అమ్మా! ఇదెన్నోసారి?" గారాంగా మారాం చేస్తున్నట్లు గునిసాడు సుదీప్.

"నువ్వు ఇండియా వెళ్ళడం ఇదే మొదటిసారి కదా!"

"కానీ నువ్వు, నాన్నగారు కలిసి మొదటిసారి ఇక్కడికి వచ్చిన రోజులు కావు. నేను ఫ్లైట్ మారిన ప్రతి చోటనుండి నీకు ఫోన్ చేస్తాను." కుర్రకారు హుషారు కనబరిచాడు సుదీప్.

తల్లిదండ్రుల వద్ద సెలవు తీసుకుని ప్లేన్ ఎక్కాడు సుదీప్. యథావిధిగా లాంఛనాలు పూర్తి చేసుకున్న లోహ విహంగం తన రెక్కలు విప్పుకుంది.

సువర్ణ, సురేష్ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరూ వైద్యులే కావడంతో విదేశాల్లో చదివిన చదువుకు సార్థకత రావాలని అక్కడే స్థిరపడ్డారు. వారి ఏకైక సంతానం సుదీప్.

సుదీప్ చిన్న వయసులో ఒకసారి అందరూ కలిసి స్వదేశానికి వచ్చారు. తర్వాత పని ఒత్తిళ్ళు, బాధ్యతలు పెరగడం వలన కావలసినంత డబ్బు ఉన్నా కన్నవారిని కళ్ళారా చూడలేని పరిస్థితి ఏర్పడింది. సుదీప్ పాతికేళ్ళవాడయ్యాడు. ఫొటోగ్రఫీ అతని హాబీ. అంతేకాదు. నటన అన్నా, సినిమాలన్నా ప్రాణం. అందుకే ఫిల్మ్ యాక్టింగ్ డైరెక్షన్‌లో మాస్టర్ డిగ్రీ చేసాడు. మంచి దృశ్యాలను తన కెమెరాకు ఆహారం చేయడం అతనికిష్టం.

భారతదేశంలో కనిపించే ప్రకృతి దృశ్యాలు, సహజమైన అందాలు, సుందర కట్టడాల గురించి తల్లి ఎన్నోసార్లు కథలుగా చెప్పడంవలన వాటి రూపాలు అతని మనసులో ముద్రించుకుపోయాయి.

వాటినన్నింటినీ స్వయంగా వీక్షించాలనే కాంక్షతో ఇండియాకు బయల్దేరాడు. అందరూ రావాలనే అనుకున్నారు. కానీ అనుకోకుండా సువర్ణ, సురేష్‌లకి వృత్తిలో సమస్య వచ్చింది. అందువల్లనే సుదీప్ ఒక్కడే బయల్దేరాడు.

ముంబయిలో ఫ్లైట్ ల్యాండవగానే, రెడీగా ఉన్న హైదరాబాద్ ఫ్లైట్‌లో ప్రవేశించాడు.

హైదరాబాద్ చేరగానే రాజమండ్రి పక్కనున్న పల్లెటూరికి టాక్సీ మాట్లాడుకున్నాడు.

సువర్ణ పెంపకంలో తెలుగులో సుశిక్షితుడవడంవలన భాషాపరంగా సమస్య ఎదురుకాలేదు.

టాక్సీలో కూచోగానే సీటుకి తల ఆన్చి కళ్ళు మూసుకున్నాడు.

తల్లి వర్ణించిన విషయాలన్నీ దృశ్య రూపంలో కళ్ళ ముందు కదలాడసాగాయి.

పచ్చని పంట పొలాలు, ఎడతెరగక పారే సెలయేరు, పాపికొండల మధ్య సూర్యోదయం, పక్షుల కిలకిల రవాలు, సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, కోకిలమ్మ కుహూ రాగాలు... ఒకటేమిటి?

తలచుకుంటున్నకొద్దీ మనోజ్ఞంగా అనిపించింది.

ఆనందంతో కళ్ళు మూసుకున్న సుదీప్‌కి వెంటనే నిద్ర పట్టేసింది.

"సార్! రాజమండ్రి వచ్చేసాం. ఎక్కడికి వెళ్లాలి?"

డ్రైవర్ మాటలకి మెలకువ వచ్చి తల్లి చెప్పిన గుర్తులు చెప్పాడు.

"తాతగారింట్లో ఘన స్వాగతం లభించింది అతడికి. ఫలానా వారి మనవడు అమెరికానుండి వచ్చాడని తెలియగానే వీధిలో అందరూ వచ్చి అతడిని చూసెళ్తున్నారు.

సుమారు ఇరవై ఏళ్ల తర్వాత మనవడు కనిపించడంతో పొంగిపోయారు. కూతురు పోలికలు అతనిలో వెతికే ప్రయత్నం చేసి, విఫలం కాలేరు వాళ్ళు.

సువర్ణ తల్లి కస్తూరమ్మ మనవడికి కొసరి కొసరి వడ్డించింది.

"మా అమ్మ పెట్టే ఆవకాయ వేడి వేడి అన్నంలో కలుపుకుని గానుగ నూనె వేసుకుని తిన్నామంటే... అబ్బ... స్వర్గం కన్పిస్తుందనుకో" తల్లి మాటలు గుర్తొచ్చి నోట్లో నీళ్లూరాయి సుదీప్‌కి.

కానీ సువర్ణ వర్ణించినంత రుచిగా లేవు వంటకాలు. తమకు అమెరికాలో 'ఇండియన్ స్వీట్స్' షాపులో కొనుక్కున్న వస్తువుల్లాగే అనిపించింది ఆ రుచి.

ఉండబట్టలేక అడిగేసాడు "అమ్మమ్మా! బొబ్బట్లు నువ్వు తయారుచేసినవేనా?"

"అబ్బే కాదురా! నాకంత తీరికెక్కడ? నువ్వొచ్చావని, 'మీ ఇల్లు' అనే షాప్‌నుండి తెప్పించాను. ఎలా ఉన్నాయి?" అడిగింది కస్తూరమ్మ. అదోలా తల ఊపాడు.

కస్తూరమ్మ ఏవేవో ప్రశ్నలు వేస్తోంది. అన్నింటికీ ఆవిడకి సంతృప్తి అయిన సమాధానాలే రాబట్ట గలిగింది.

రోజులు గడుస్తున్నకొద్దీ సుదీప్ చాలా విషయాలు గ్రహించాడు. సువర్ణ వర్ణించిన దానికీ, ప్రస్తుత పరిస్థితికీ చాలా తేడా ఉంది. అమ్మమ్మకీ, మేనమామ భార్యకీ క్షణం పడదు. ఇద్దరూ ఉప్పు, నిప్పులా చిటపటలాడిపోతున్నారు.

"మా అమ్మ నన్నెలా చూస్తుందో, మా వదినని కూడా అంతే ప్రేమగా చూస్తుంది" తల్లి మాటలకీ, ఇక్కడ మనుషులకీ పొంతన అసలు కుదరలేదు. సుదీప్ బుర్ర తిరిగిపోయింది.

అనురాగపు మాటలు, ఆప్యాయపు పూతలు, అత్తాకోడళ్ళ ప్రేమాభిమానాలు, తాతయ్య చిరు కోపాలు, అమ్మమ్మ ముసిముసి నవ్వులు, మేనమామ విసుర్లు, అత్తయ్య అలకలు... ఇవేవీ కానరాలేదు.

"మా ఇంట్లో పాలేర్లతో సహా రోజుకి పదిహేను, ఇరవై మంది వరకూ భోంచేస్తారు. పనివాళ్ళకి వేరే వండడం ఉండదు. మాకెన్ని రకాలు వండుతారో అన్ని పనివాళ్ళకి కూడా పెట్టకపోతే మీ తాతగారు ఊరుకోరు." తల్లి తరచు చెప్పే విషయం ఇది. కానీ అమ్మమ్మ, అత్తయ్య ఏదో మొక్కుబడిగా వండి పడేయడం, తిన్నామనిపించడం...

"ఒరే! కబడ్డీ ఆడేటప్పుడు నేను వాళ్ళవైపే ఉండాలని రెండు జట్ల వాళ్లూ దెబ్బలాడుకునేవాళ్లు తెలుసా? అబ్బో! అదొక్కటేనా? ఎన్ని ఆటలు?" చెప్తుంటే సుదీప్ తండ్రి సురేష్ కళ్ళు అరమోడ్పులయ్యేవి.

కానీ గ్రామీణ వాతావరణంలో కూడా అవేమీ కనబడలేదు. పిల్లలు కూడా యాంత్రికంగా కనిపించారు.

ఇంగ్లీషు మీడియం చదువుల మోజులో పడిన తల్లిదండ్రులు పిల్లలు మోయలేని భారాన్ని భుజాలపై వేసుకుని స్కూలుకు వెళ్ళడం, వచ్చాక కూడా శక్తికి మించిన హోమ్‌వర్క్‌ల్లో మునిగిపోవడం, ఇదే జీవితంగా మారింది.

తల్లి వర్ణించిన తెలుగుదనంలో ఏదో వెలితి ఉందని గ్రహించాడు.

దానికి కారణమేమిటో తెలుసుకోవడానికి అతని తెలివైన మెదడుకి ఎక్కువ కాలం పట్టలేదు.

* * *

"ఏంటమ్మా! అన్నం అంతా ఇలా మాడ్చేసావు.

సాంబారులో పోపు కూడా సరిగా వేగలేదు. నలుగురు తినే వంట వండుతున్నప్పుడు కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలి. ఏదో మొక్కుబడిగా వండి పడేయకూడదు." అమ్మమ్మ అరుపులు అత్తయ్య పైనేనని అర్థమయింది సుదీప్‌కి.

గది పక్కగా వెళ్తున్న సుదీప్ టక్కున ఆగిపోయాడు ఏవో మాటలు వినిపించడంతో.

"అసలేమనుకుంటోందీవిడ? ఎన్నాళ్లు ఆవిడ పెత్తనం సాగాలి? దానికి... దానికి అంతం లేదా? అసలు... అసలు... నాకంటూ స్వతంత్రం లేదా? కాపురానికొచ్చి పాతికేళ్ళు దాటినా ముసలావిడదే అజమాయిషీ! అందరూ తన మాటే వినాలనుకుంటుంది. చూస్తాను... చూస్తానెంతకాలం ఇలా జరుగుతుందో! నా తడాఖా చూపిస్తాను."

ఇలా తనలో తను మాట్లాడుకుంటున్నదెవరో కాదు. సుదీప్ మేనమామ భార్య రుక్మిణి. ఖిన్నుడయ్యాడతను.

అమ్మమ్మ కూడా అలా అరిచి ఉండాల్సింది కాదు. పోనీ ఏదో పెద్ద వయసుకొద్దీ అందే అనుకో. ఈవిడ అమ్మమ్మ దగ్గరకెళ్ళి ఈ విధంగా ఇంకోసారి పొరపాటు జరగకుండా చేస్తానని చెప్పేయచ్చు కదా! దాని కింతలా స్వగతం ఎందుకో? పైగా ఒక్కో పదాన్నీ రెండేసిసార్లు పలకడం. అబ్బుర పడ్డాడు సుదీప్.

* * *

"అత్తయ్యా! నేను, ఆయనా సినిమాకెళ్తున్నాం" చీర అంచు సవరించుకుంటూ రుక్మిణి చెప్పింది.

"ఏ సినిమాకే? నేనూ వస్తాను" బయల్దేరబోయింది కస్తూరమ్మ.

"హిందీ సినిమా. మీకర్థంకాదులెండి" అని విసవిసా నడుచుకుంటూ పోయింది రుక్మిణి.

ఓసి దాని పొగరు బంగారం కానూ! ఎంత విసవిసలు పోతోంది! మొగుడ్ని కొంగుకు కట్టేసుకుని తన చుట్టూ తిప్పుకుంటోంది. తను ఆడింది ఆట, పాడింది పాటగా జరుపుకుంటోంది.

నన్ను... నన్ను... రావద్దంది కానీ తను మాత్రం చిన్న కూచి పిల్లా? లేక మొన్నే పెళ్లైందా?" అమ్మమ్మ కూడా అత్తయ్య లాగానే తనలోతను మాట్లాడుకోవడం చూసిన సుదీప్ మతిపోయింది.

* * *

ఏమీ తోచక వీధిలో పిల్లలు ఆడే ఆటలు చూస్తూ కూచున్నాడు సుదీప్. పిల్లలంతా గోళీలాట ఆడుతున్నారు.

"అమ్మయ్య! గ్రామీణ భారతంలోని దృశ్యం కళ్లకు కట్టిందిం" అంటూ సంబరపడ్డాడు.

కొంతసేపు అయ్యాక ఎందుకో గానీ ఇద్దరికి తగువొచ్చింది. ఆ తగవు క్రమంగా పెద్దదయింది.

"నువ్వెవడివిరా? నేను నీకన్నా గొప్పవాడిని. మా తాతగారు బొబ్బిలి రాజాల దగ్గర దివాన్‌గా ఉండే వారు తెలుసా!"

"ఆ! బోడి గొప్ప! అలా పనిచేసే ఎంతో డబ్బు దాచేసేరట. మా అమ్మ చెప్పింది."

"మీకన్నా కాదురా! చేస్తున్న ఉద్యోగం కాకుండా బల్లకింద చేతులు పెట్టి సంపాదించినదేనట మీ డబ్బంతా!".

నివ్వెరపోయాడు సుదీప్.

ఏ కల్మషాలూ సోకకూడని పసి వయసు వీరిది. అలాంటిది వీరు తరతరాల నెత్తి పెట్టి పోట్లాడుకుంటున్నారు.

"మున్సబుగారమ్మాయి, పూజారిగారి పుష్ప, పాలేరు వీరయ్య కూతురు సీత, నేను అందరం కలిసి అట్లతద్ది నోములు నోచే వాళ్ళం." సువర్ణ మాటలు మళ్ళీ మెదిలాయి.

ఎందుకీ మార్పు? ఏమిటీ కారణం?

ఒక్కసారిగా జుత్తు పీక్కోవాలనిపించింది సుదీప్‌కి.

ఆలోచించినకొద్దీ ఆప్యాయతలు, అభిమానాలు లోపించడానికి కారణం కనిపిస్తూ వచ్చింది. అది మరేమీ కాదు.

అసలేమనుకుంటోందీవిడ? ఎన్నాళ్లు ఆవిడ పెత్తనం సాగాలి? దానికి... దానికి అంతం లేదా? అసలు... అసలు... నాకంటూ స్వతంత్రం లేదా? కాపురానికొచ్చి పాతికేళ్ళు దాటినా ముసలావిడదే అజమాయిషీ! అందరూ తన మాటే వినాలనుకుంటుంది.

ఆంధ్రుల అభిమాన వస్తువు. భార్యాభర్తలు ఎడమొగం, పెడ మొగంగా తయారవడానికీ, అత్తా కోడళ్ళు కీచులాటలకీ అన్నింటికీ అదే కారణం.

ఈపాటికి మీకర్థం అయ్యే ఉంటుంది. అదేనండీ... బుల్లితెర, అందులో నిరంతరాయంగా ప్రసారమయ్యే సీరియల్స్.

ప్రేమ పలకరింపులు, ఆప్యాయపు పలుకులు ఎందుకు కొరవడ్డాయో గ్రహించాడు.

పొద్దున్నే మొక్కుబడిగా వండి మొగుడ్ని, పిల్లల్ని పంపేసి టి.వి. ముందు సెటిలైపోవడం అందరికీ అలవాటయిపోయింది. ఒకదాని తర్వాత ఒకటి శరపరంపరగా వస్తున్న సీరియల్స్ మాయలో పడి మానవ సంబంధాలను తెంచేసుకుంటున్నారు.

పిల్లలు కూడా చదువు అవగానే టి.వి. ముందు కూర్చోడానికే మొగ్గు చూపుతున్నారు.

మాటకి మాట కొంటరివ్వడం తప్ప సర్దుకుపోవడం లేదు.

ఈ వాతావరణంతో బుర్ర పిచ్చెక్కిపోయి, నాయనమ్మ గారింటికి బయల్దేరాడు.

* * *

"అత్తయ్యా! అమ్మ వస్తుంది. మీరు త్వరగా తయారవండి. లేకపోతే మిస్సవుతారు." చిన్నాన్న భార్య చెప్పడంతో నాయనమ్మ గబగబా స్నానంచేసి తయారవడం చూసాడు సుదీప్.

"అవునే! అమ్మని చూడకపోతే నాకు ఏదోలా ఉంటుంది" నాయనమ్మ మాటలతో.

"నాయనమ్మా! పిన్ని వాళ్ళ అమ్మ వస్తున్నారా ఇక్కడికి?" సుదీప్ అడిగాడు. ఆ మాటలకి పగలబడి నవ్వింది సుదీప్ పిన్ని.

"మా అమ్మకాదయ్యా! టి.విలో వచ్చే సీరియల్ 'అమ్మ'. అది రోజూ మీ నాన్నమ్మ చూస్తారు. లేకపోతే ఆవిడకి తోచదు" చెప్పింది.

అమ్మ బాబోయ్! ఇక్కడా అదే వాతావరణం!

ఒక నిర్ణయానికి వచ్చిన సుదీప్ ఇండియా అంతా తిరిగొస్తానని బయల్దేరాడు.

* * *

హైదరాబాద్ చేరుకున్న సుదీప్ వెంటనే తన ఈ-మెయిల్ ఫ్రెండ్ సాయంతో టెలివిజన్ ఛానెల్స్ ఆఫీసులకి వెళ్ళాడు.

తను తీయబోయే సీరియల్స్ ప్రసారం చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రసార సమయం, చెల్లించాల్సిన డబ్బు అన్నీ మాట్లాడుకున్నాడు.

సుదీప్ ఈ-మెయిల్ ఫ్రెండ్, అతని మిత్ర బృందాన్ని రంగంలోకి దింపాడు. ఒకేసారి మూడు డైలీ సీరియల్స్ నిర్మించడానికి సుదీప్ సన్నాహాలు చేస్తున్నాడు.

వందలాది నటీనటులను బుక్ చేసాడు. మంచి రైటర్ని పిలిపించి తనకు కావలసిన విషయాలు చెప్పాడు.

నిజానికి అతడిలోనే క్రియేటివిటీ ఉంది. కానీ దర్శకత్వ బాధ్యతలు కాక అతడు ప్రధాన పాత్ర పోషిస్తుండడంలో రచన వేరొకరికి అప్పచెప్పాడు.

పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నటీనటులందరిలోనూ తనకు కావలసిన కవళికలను రాబట్టుకున్నాడు సుదీప్.

అతని ఆశ, ప్రయత్నం వృధాకాలేదు.

మంచి కథ, కథనంతో రూపుదిద్దుకున్నాయి సీరియల్స్. మూడు ప్రైవేటు ఛానల్స్‌లో వేర్వేరు సమయాల్లో ప్రసారాలు మొదలయ్యాయి.

మానవ సంబంధాలన్నీ ఇలా ఉండాలని తెలియచేసే దృశ్య కావ్యాలవి.

* * *

అమ్మమ్మగారింట్లో అడుగుపెడుతూనే కనిపించిన దృశ్యాన్ని అపురూపంగా చూసాడు సుదీప్.

అత్తయ్య జంతికలు చేస్తుంటే, అమ్మమ్మ సున్నుండలు కడుతోంది. నేతి వాసన ఘుమాయిస్తోంది.

"రా! రా ఎక్కడికెళ్ళిపోయావురా?" ఆప్యాయంగా పలకరించింది కస్తూరమ్మ.

"చెప్పాగా! ఆలిండియా తిరిగొస్తానని!" బదులిచ్చిన సుదీప్‌తను ఆశించిన మార్పు కనబడడంతో సంతృప్తి చెందాడు.

దేనికైనా ప్రోపర్ ఛానల్స్ ద్వారా వెళ్ళాలంటారు కదా పెద్దలు!

ఆ కిటుకు తెల్సినవాడైన సుదీప్ ఆ ప్రయోగమే చేసాడు. అనుబంధాలను దూరంచేసిన బుల్లితెర ద్వారానే అవి పెంపొందే అస్త్రాల్ని సంధించాడు.

యథాతథంగా ఫాలో అయ్యే మహిళలు అతని సీరియల్స్‌నీ ఫాలో అయి సంబంధ, బాంధవ్యాలను పునరుద్ధరించుకున్నారు.

సుదీప్ ప్రయత్నం ఫలించింది.

"అమ్మమ్మ, అత్తయ్యలను వీడియో తీసి అమ్మకు చూపించాలి. మనసులోనే అనుకున్నాడు సుదీప్. ★

రచయిత చిరునామా:
టి.పి.హేమమాలిని,
మిడిల్ స్ట్రీట్,
సింహాచలం- 530 028.